క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 30 కేసులు పరిష్కారం



బంటుమిల్లి: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో పలు సంఘటనల్లో నమోదైన 30 కేసులు పరిష్కారం అయినట్లు కోర్టు ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సాధికార కమిటీ చైర్మన్ ఎం.భాస్కరరావు పర్యవేక్షణలో లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి భాస్కరరావు మాట్లాడుతూ కక్షలు కార్పణ్యాలకుపోయి కేసుల్లో ఇరుక్కుని విలువైన సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని హితవు పలికారు. ఈ సందర్భంగా లోక్‌అదాలత్ ప్రాముఖ్యతపై ఆయన కక్షిదారులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వై.శోమశేఖర్, పీవీ వెంకటేశ్వరరావు, ఈవీఎస్ రాయుడు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సుకోసం పనిచేయండి



చిలకలపూడి(మచిలీపట్నం): పింఛన్ల పంపిణీ పుణ్య కార్యక్రమం లాంటిదని సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో అధికారులు, సచివాలయ ఉద్యోగులకు పింఛన్ల పంపిణీపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో ప్రతిష్టాత్మకమైనదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అమలు చేస్తున్నారన్నారు. మచిలీపట్నం నియోజకవర్గానికి సంబంధించి 31,068 మంది లబ్ధిదారులకు రూ.21 కోట్లకు పైగా నగదును పంపిణీ చేయాల్సి ఉందన్నారు. జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనంద్‌కుమార్, డీఆర్డీఏ ఇన్‌చార్జ్ పీడీ నాగేశ్వరనాయక్, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంవీ బాబాప్రసాద్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, కుంచె దుర్గాప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

5న గాంధీక్షేత్రంలో జాబ్‌మేళా

అవనిగడ్డ: అంజనాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 5వ తేదీన గాంధీక్షేత్రంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ చైర్మన్ బచ్చు నవీన్ తెలిపారు. శనివారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ని కలసి జాబ్‌మేళా గురించి చర్చించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహణకు ముందుకు రావడం మంచి పరిణామన్నారు. నవీన్ మాట్లాడుతూ పది, ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ చదివిన విద్యార్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. మండలి వెంకట్రామ్, బచ్చు వెంకటనాథ్, శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ శ్యాంకిశోర్‌నాయుడు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ఉండిపోవద్దు



పెడన: మీ పరిధిలో ఏం జరుగుతున్నా నా దృష్టికి తీసుకురండి...మీ సమస్యలుంటే తెలియజేయండి...ప్రజలు మెచ్చుకునేలా పరిపాలన చేయండి అంటూ పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం ఆయన పెడన మండలంలోని ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లు భవనాల శాఖకు సంబంధించి నడుపూరు నుంచి కొత్తపల్లి వరకు వేసిన టెండర్ల విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే వ్యక్తి (ఒక సంస్థ) వేయడం వల్ల పనులు జరగలేదని, వారు చేయడానికి ముందుకు రాలేదని డీఈ కె.శ్రీనివాస్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. నేలకొండపల్లి నుంచి ఉరివి వరకు రోడ్డు మరీ అధ్వానంగా గోతులు మయంగా ఉందని, ఇదే పరిస్థితి ఇంకా ఎన్నాళ్లుంటుందని టీడీపీ శ్రేణులు ప్రశ్నించారు. కోటి రూపాయలకు అంచనాలు వేసి పంపించామని డీఈ వివరించారు. సాగునీరు ఎప్పుడు ఇస్తారని, గుర్రపు డెక్క, తూ డు తొలగించడానికి టెండర్లు పిలిచి పనులు ఎప్పు డు అప్పగిస్తారని ఎమ్మెల్యే కాగిత సంబంధిత శాఖాధికారిని ప్రశ్నించారు. గ్రామీణ నీటి సరఫరాపై మాట్లాడుతూ ఏ గ్రామంలో అయినా సక్రమంగా తాగునీరు సరఫరా అవుతుందా అని ఎమ్మెల్యే కాగిత ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్రవంతిని ప్రశ్నించారు. రూ15.57కోట్లు వచ్చి ఉన్నాయని, వీటికి సంబంధించి పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి

- పెడన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం
- పలు అంశాలపై చర్చ



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కటకం నాగకుమారి



కౌన్సిల్ సాధారణ సమావేశానికి హాజరైన సభ్యులు

పెడన: కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో నూతనంగా ఎన్నికైన సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, ఎంపీ బాలశౌరికి, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌లకు ముందుగా శుభాకాంక్షలని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో జరిగింది. అజెండాలోని 21 అంశాలపై చర్చించారు. వీటిల్లో ఐదు అంశాలకు సంబంధించి జనసేన కౌన్సిలర్ శివపావని డీసెంట్ ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. వార్డు సచివాలయాల అద్దె పెంపు, పారిశుద్ధ్య కార్మికులను జనభాప్రాతిపదికగా మరో 8 మందిని అదనంగా తీసుకోవడం, పారిశుద్ధ్య విభాగంలో అదనంగా సిబ్బంది అవసరమని గుర్తించి, వారిని ఇతర విభాగాల్లో కొనసాగిస్తూ జీతాలు ఇవ్వడం, రోడ్డు మార్జిన్‌లో ప్రైవేటు బ్యాంకు ఏటీఎం ఏర్పాటుకు ఆమోదం వంటివాటిపై డీసెంట్ ఇస్తున్నట్లు తెలిపారు. సదరు విషయాలపై చైర్‌పర్సన్ భర్త, 8వ వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలను స్వీకరించి 11 నెలలు కావస్తోందని, ఈ కాలంలో ఉద్యోగులను ఎవరినీ కొత్తగా తీసుకున్నది లేదన్నారు. పాతవారిని తొలగించిన దాఖాలలు కూడా లేవని తెలిపారు. పదవి ఎక్కిన సమయంలో ఖజానా జీరో అని తెలిపారు. ఆస్తిపన్నులు బకాయిలు పేరుకుపోవడంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వసూలు చేయడంతో జిల్లాలో టాప్ ప్లేస్‌లో ఉన్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయిన నేపథ్యంలో పట్టణాభివృద్ధికి సహకరిస్తే పూర్తిస్థాయిలో ముందుకు అడుగులు వేస్తామని, ప్రతి విషయాన్ని కూడా అడ్డుకుంటే పట్టణాభివృద్ధి కుంటు పడుతుందని స్పష్టం చేశారు.

తాగునీరు పూర్తి స్థాయిలో ఇవ్వలేని పరిస్థితి..

ప్రస్తుతం తరకటూరు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో తాగునీరు పూర్తిస్థాయిలో లేని కారణంగా పురప్రజలకు తాగునీరు పూర్తిగా అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అక్కడ నుంచి రావాల్సిన రా వాటర్ అవసరం మేరకు అందని పరిస్థితి ఉండటం వల్ల దీనిపై ఏమీ చేయలేని దుస్థితి నెలకొందని, మరో పక్క కాలువలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ఆదాయం వస్తుందని ఏటీఎంకు స్థలం కేటాయించడం జరిగిందని, దీనిని కూడా అడ్డుకోవడం, డీసెంట్ చెప్పడం భావ్యం కాదని కటకం ప్రసాద్ అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జూలై 1వ తేదీన పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని జిల్లాలోని పింఛన్ల పంపిణీ కోసం చేసిన ఏర్పాట్లను సీఎస్‌కు వివరించారు. జిల్లాలో 2,42,321 మంది లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. బ్యాంకుల నుంచి 70 శాతానికి పైగా నగదు డ్రా చేయటం జరిగిందని సీఎస్‌కు వివరించారు. సచివాలయ ఉద్యోగులు వారి పరిధిలో రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకుని ఉదయం 6 గంటల నుంచి ప్రారంభించేలా చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ నాగేశ్వరనాయక్ పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



చోరంపూడి ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత

బంటుమిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మంచి భవిష్యత్తును అందుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని ఉన్నత వద్యావంతులు కావాలని పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్(కేపీ)అన్నారు. చోరంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టూడెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎంఈఓ బీ త్రిపురసుందరీదేవీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సాయాన్ని అందిపుచ్చుకుని పాఠశాలలకు, గ్రామాలకు మంచి పేరు తేవాలన్నారు. సర్పంచ్ రేవు నాగలక్ష్మి, ఎంపీపీ వెలివెల చినబాబు, జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, ఎంపీటీసీ తిరుమలశెట్టి లక్ష్మి, హెచ్‌ఎం వి.ధనలక్ష్మి, టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెడన: మండలంలోని కాకర్లమూడి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూలు కిట్ల పంపిణీ కార్యక్రమాన్నిపెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. మండల విద్యాశాఖ అధికారి-1 దుర్గ ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి-2 వైవీ హరనాథ్, జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్ ప్రధానో పాధ్యాయులు హేమమాలిని, కె.వి.మహాలక్ష్మి, ఉపాధ్యాయులు గ్రామస్తులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డుల మంజూరుపై సమీక్ష

బంటుమిల్లి: మండలంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ) సిద్ధం చేయాలని తహసీల్దార్ ఎం.రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎంఏవో శివరామకృష్ణతో కలసి విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు(వీఏఏ), గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌ఓ)లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంత మంది కౌలురైతులను గుర్తించాం, వారిలో ఎంతమందికి గత సంవత్సరం సీసీఆర్‌సీలు మంజూరు చేశామన్న విషయాలపై గ్రామ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై ఏఓ శివరామకృష్ణ మాట్లాడుతూ గత సంవత్సరం 1,505 మందికి కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేశామన్నారు. రవికుమార్ మాట్లాడుతూ గత సంవత్సరం కంటే కార్డులు పెంచేందుకు వీఏఏలు, వీఆర్‌ఓలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సీసీఆర్‌సీల వల్ల ప్రభుత్వం నుంచి కౌలు రైతులకు లభించే రాయితీలపై వారికి అవగాహన కలిగించాలని తహసీల్దార్ తెలిపారు. ఈ సమావేశంలో డీటీ రామశివ, ఆర్‌ఐ శేఖర్, శంకర్, పలు గ్రామాల వీఏఏలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఫీవర్ సర్వే ప్రారంభం



బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో శనివారం నుంచి ఇంటింటికీ ఫీవర్ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సువర్చల పర్యవేక్షణలో సిబ్బంది పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్ల ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ రక్త పరీక్షలు చేస్తూ వైరల్ జ్వరాలపై నివేదికలు తయారు చేస్తున్నారు. సాతులూరు గ్రామంలో డెంగీ, మలేరియా, బోధకాలు తదితర వైరల్ జ్వరాలను గుర్తించేందుకు వైద్య పరీక్షలు చేపట్టారు. అనుమానితుల రక్త నమూనాలను పరీక్షల నిమిత్తం మచిలీపట్నం లాబ్‌కు పంపుతున్నారు. గ్రామాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కలిగించారు. సూపర్‌వైజర్లు ఎం.ఏసుదాసు, గాయత్రి, రంగ పార్వతి, యూనస్, రాజారావు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కేవీకే శాస్త్రవేత్తలకు ప్రశంసా పత్రాలు



కేవీకే తరుపున ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత

ఘంటసాల: వరి, మినుము విత్తనాల ఉత్తత్తి, రైతులకు పంపిణీలో ప్రతిభ చూపిన ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రానికి అటారి జోన్-10లో రెండో స్థానం సాధించినట్లు కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ రాజమండ్రిలో అఖిల భారత వ్యవసాయ పరిశోధన మండలి అటారి జోన్-10, అన్యువల్ జోనల్ వర్క్‌షాప్ 2024-25 కార్యక్రమాన్ని ఘంటసాల కేవీకే తరుపున హాజరైనట్లు చెప్పారు. ఈ సమావేశాలకు అటారీ జోన్-10 పరిధిలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాల్లోని కేవీకేల్లో 2023-24 సంవత్సరానికి నాణ్యమైన వరి (ఎంటీయూ 1061, 1318), మినుము ఎల్‌బీజీ 752 విత్తనాల ఉత్పత్తి, రైతులకు పంపిణీ చేసే విధానంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం రెండో స్థానంలో నిలవడంతో ప్రశంసా పత్రాన్ని అందించినట్లు చెప్పారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ తలపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మూడు నెలల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించినందుకు ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలోని ఆరుగురు శాస్త్రవేత్తలకు, పీసీతో ఏడుగురుకి ప్రశంసా పత్రాలు వచ్చాయని డాక్టర్ శ్రీలత చెప్పారు.

మాజీ మంత్రి డీఎస్ మృతికి ఎమ్మెల్యే సంతాపం

అవనిగడ్డ: మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ మరణం పట్ల ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. శ్రీనివాస్‌తో తనకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉందని, రాజకీయాల్లో తనకు ఎంతో వెన్నుదన్నుగా ఉన్నారని చెప్పారు. కృష్ణా జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పనిచేసిన ఆయనకు జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉందని బుద్ధప్రసాద్ తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

ఉద్యోగులకు వీడ్కోలు



మోపిదేవిలో ఎంఈవో-2 రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కుకింగ్ ఏజెన్సీ ప్రతినిధులు

పెడన: పెడన మండల పరిషత్ కార్యాలయంలో ఏవో ఓ.బాలాజీ, అటెండరు వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేయడంతో వారికి వీడ్కోలు సభను ఆదివారం ఏర్పాటు చేశారు. పెడన, గూడూరు ఎంపీపీలు రాజులపాటి వాణి, సంగా మధుసూదనరావులతో పాటు మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, వైఎస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాదరావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీడీవో రెడ్డయ్య, కృత్తివెన్ను ఎంపీడీవో పిచ్చిబాబు, సచివాలయ ఉద్యోగులు వీరికి ఘనంగా వీడ్కోలు పలికారు. బాలాజీ, లలిత లక్ష్మీరాణి దంపతులతో పాటు వెంకటేశ్వరరావు, భాగ్యలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. పురపాలక సంఘ ఎలక్ట్రీషియన్ ఉమ్మిటి ఆనందరావు ఉద్యోగ విరమణ చేయడంతో ఆనందరావు దంపతులను మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కటకం ప్రసాద్‌లను సత్కరించారు.వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, జ్యోతి, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, సిబ్బంది సన్మానించారు.

మోపిదేవి: మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో-2 రాజ్‌కుమార్‌ను మధ్యాహ్న భోజన పథకం ఏజెంట్లు శనివారం సాయంత్రం గొరిపర్తి వేణు అధ్యక్షతన వీడ్కోలు సభ నిర్వహించారు. శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా తన సొంత డబ్బులు రెండు సార్లుగా రూ.2.80 లక్షలతో ఎంఈవో కార్యాలయానికి రంగులు, డోర్లు వేయించిన ఘనత ఆయనకే దక్కిందని పలువురు పేర్కొన్నారు. మండలంలోని కుకింగ్ ఏజెన్సీ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: ఎంతో మందికి మార్గదర్శిగా నిలిచే ఉపాధ్యాయ వృత్తి ఆదర్శప్రాయమైనది డైరెక్టర్ ఆఫ్ ఏపీ స్కూల్ ఎగ్జామినేషన్ బోర్డు దేవానంద రెడ్డి పేర్కొన్నారు. గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఆదివారం ఉద్యోగ విరమణ చేస్తున్న నాగులపల్లి విజయలక్ష్మి సన్మాన సభ శనివారం నిర్వహించారు. హెచ్‌ఎం డి.పుష్పలత అధ్యక్షతన విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయాలి

గూడూరు: ఎన్‌టీఆర్ భరోసా పథకం ద్వారా జూలై మాసానికి సంబంధించి లబ్ధిదారులకు ఇంటింటికీ పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంపీడీఓ ఎన్.ప్రేమాన్విత తెలిపారు. మండలంలో 8,452 మందికి పింఛన్లు పంపిణీ చేయడానికి 140 మంది ఉద్యోగులను నియమించినట్లు వెల్లడించారు. పింఛన్లకు సంబంధించి రూ.5,68,47,500 ఇప్పటికే సిబ్బందికి అందజేశామన్నారు. లబ్ధిదారులు సచివాలయాలకు రావాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు.

కోడూరు: జూలై నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, ఇతర సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఒకటవ తేదీన ఉదయం 6గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించి, సాయంత్రానికి పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఈసారి పెన్షన్ల నగదు పెరగడంతో అందరూ జాగ్రత్త వహించాలన్నారు. మండలంలోని 13 సచివాలయాలకు సంబంధించి 7,380 మందికి గాను రూ.2.74కోట్ల నగదు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పింఛన్లు పంపిణీ చేసే ఉద్యోగులు ఆదివారం ఆయా గ్రామాల్లో పర్యటించి, పింఛన్‌దారుల ఇళ్లను తెలుసుకొని ముందుగానే సమాచారమివ్వాలని సూచించారు. ఈఓపీఆర్డీ నాగరేవతి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల: పింఛన్లను సకాలంలో సమర్థవంతంగా పంపిణీ చేయాలని ఎంపీడీవో బి.మారుతి శేషమాంబ తెలిపారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో వీడియో కాన్ఫరెన్స్ శనివారం నిర్వహించగా మండలంలోని అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో మారుతీ శేషమాంబ మాట్లాడుతూ మండలంలో 13 గ్రామ సచివాలయాల పరిధిలో 7,215 మంది వివిధ రకాల పింఛనర్లు ఉండగా రూ.12,33,07,850 నగదు మంజూరైనట్లు తెలిపారు. ఈఓపీఆర్డీ గుత్తికొండ కిషోర్, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యంలో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిష్కరించారు. ఈ ప్రాంతంలో తాగునీటి సరఫరా చేసే బోర్లు పూర్తిగా పాడవడంతో కొన్ని రోజుల నుంచి ఈ ప్రాంత వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని కాలనీ వాసులు రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ ఈవోని పిలిపించి రెండు రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ ద్వారా నూతన బోర్లు వేయించారు. శనివారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ లంకమ్మమాన్యం కాలనీలో పర్యటించి నూతన బోర్ల నుంచి సరఫరా చేసిన కుళాయిల నీటిని ఆయన పరిశీలించారు. అధికారులు పరిస్థితిని వివరించారు. కొత్తగా వేసిన బోర్లకు ప్లాట్ ఫాం కట్టించి నీటి సరఫరా చేస్తామని సంబంధిత అధికారులు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సత్యనారాయణ, ఏఈ జగత్, పంచాయతీ ఈవో తోట శ్రీనివాసరావుతో పాటు పలువురు జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్థలాల కేటాయింపు

అవనిగడ్డ: కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి, షిర్డీసాయి అన్నదాన సేవా కార్యక్రమం నిర్వహణకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్థలం కేటాయించారు. కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఆర్యవైశ్య సంఘం నేత ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య) పలువురు ఆర్యవైశ్య పెద్దలు గతంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ని కోరారు. ఈ నేపథ్యంలో గుర్రప చెరువు వద్ద ఖాలీగా ఉన్న 4 సెంట్ల పంచాయతీ స్థలాన్ని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నిర్మాణానికి కేటాయించారు. ఈ ప్రాంతంలో ఉన్న మరో రెండు సెంట్లు స్థలాన్ని షిర్డీసాయి అన్నదాన సేవా కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం కేటాయించారు. ఈ మేరకు ఈ స్థలాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ శనివారం పరిశీలించారు. స్థలాన్ని కేటాయించినందుకు షిర్డీసాయి అన్నదాన సేవా కార్యక్రమం నిర్వాహకులు చిట్టా ప్రసాద్ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో తోట శ్రీనివాసరావు, జనసేన నేతలు అన్నపరెడ్డి వెంకటస్వామి, అన్నపరెడ్డి రాందాస్, జనసేన పట్టణ కన్వీనర్ రాజనాల వీరబాబుతో పాటు పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు సిద్ధం



కోడూరు: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో బీసీటీ-5204 రకం వరి విత్తనాలు సబ్సిడీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఏఓ ఎం.శ్రీధర్ తెలిపారు. ప్రస్తుతం 208 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కేజీకి రూ.5 సబ్సిడీని ఇవ్వనున్నట్లు చెప్పారు. కేజీ విత్తనాల ధర రూ.41.80 కాగా సబ్సిడీ పోను రూ.36.80 వంతున రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. 25 కేజీల ప్యాకెట్‌కు రూ.125 సబ్సిడీ వస్తుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్తుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ తీసుకొని సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని ఏఓ కోరారు.

హుండీ ఆదాయం రూ.4.77 లక్షలు



కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి హుండీ కానుకల ఆదాయాన్ని దేవదాయ అధికారులు శనివారం లెక్కించారు. 94 రోజులకు గాను హుండీ ద్వారా రూ.4, 77,707 ఆదాయం లభించిట్లు ఈఓ సుధాకర్ తెలిపారు. తనిఖీ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరగ్గా, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు స్థలదాత విగ్రహానికి నివాళి



వెంకటస్వామి నాయుడు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: నగరంలోని ప్రధాన రహదారిలో ఉన్న పార్కు నిర్మాణానికి కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాన్ని అందజేసిన ఉదారవాది మాకర్ల వెంకటరత్నం నాయుడు నగరాభివృద్ధికి చేసిన సేవలు మరువరానివని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆది వెలమ సంఘం ఆధ్వర్యంలో శనివారం పార్కులోని వెంకటస్వామి నాయుడు విగ్రహం వద్ద ఆయన 75వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు, కొప్పిశెట్టి శమంతకమణి, వేలూరి దిలీప్‌కుమార్, సూరత్తు పాండురంగారావు, మునిసిపల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు.